క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అమీర్‌గూడలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు మందడి వెంకట్‌రెడ్డి, లక్ష్మినారాయణ, నర్సింహారెడ్డి, సత్తిరెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లేశ్ముదిరాజ్, ఈశ్వర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సాయికృష్ణ

షాద్‌నగర్‌రూరల్: నందిగామ మండలం మోత్కులగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన సాయిరాజా ఫంక్షన్‌హాల్ యజమాని మంచిరేవుల సాయికృష్ణ విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఫంక్షన్ హాలులో రూ.21వేల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సాయికృష్ణను శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నర్సింలు, మహేశ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం

షాద్‌నగర్‌రూరల్: వసంత పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని మల్లికార్జున కాలనీలో గల శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో నేడు(సోమవారం) సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు వీరేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు పాఠశాల ఆవరణలో ఉదయం 9:45 గంటలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్షరాభ్యాసం చేయించేవారు కిలో బియ్యం, కొబ్బరికాయ, పూజా సామగ్రి, పూల దండ, పండ్లు, విస్తరాకు, గ్లాసు, తమలపాకులు తీసుకురావాలని సూచించారు. చిన్నారితో పాటుగా తల్లితండ్రులు సాంప్రదాయ దుస్తులతో సమయానికి విచ్చేసి అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు

చేవెళ్ల: ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశంగుప్తా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మల్లిపెద్ది వెంకటేశంగుప్తా మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. రాజకీయంగా ఎదిగేందుకు ప్రోత్సహించాలని తెలిపినట్లు చెప్పారు. పేదలకు ప్రభుత్వ పథకాలను అందించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం నాయకులు మాజీ సర్పంచ్ రెడ్డిశెట్టి మధుసూదన్‌గుప్తా, నాయకులు ఆర్ శ్రీనివాస్, ప్రభు, నవీన్, సాయిసచిన్, కృష్ణ, వీరేందర్ తదితరులు ఉన్నారు.

9 నుంచి వేణుగోపాల స్వామి జాతర

మంచాల: మండల పరిధిలోని ఆరుట్లలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు శ్రీ వేణుగోపాల స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు ఆరుట్లతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చీరాల రమేశ్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఎల్లేశ్, చంద్రయ్య, భాస్కర్, రాములు, బాషా, రఘుపతి, మాసయ్య, సురేష్, జానీ పాషా, రాజు, కుమార్, కృష్ణ, రమేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్య తీరేనా?

- డంప్‌యార్డు లేక రోడ్డు పక్కనే పారబోస్తున్న వైనం
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు
- మొయినాబాద్ మున్సిపాలిటీగా మారడంతో డంప్‌యార్డు ఏర్పాటుపై ఆశగా ఎదురుచూపు



మొయినాబాద్-సురంగల్ రోడ్డు పక్కన వేసిన చెత్త

మొయినాబాద్: మొయినాబాద్‌ను చెత్త సమస్య వేధిస్తోంది. డంపింగ్‌యార్డు లేకపోవడంతో గత నాలుగైదు సంవత్సరాలుగా సమస్య రోజురోజుకు పెరుగుతోంది. రోడ్డు పక్కనే చెత్త పారబోస్తుండడంతో స్థానికులు, వాహనదారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థపదార్థాల కోసం వస్తున్న కుక్కలు, ఆవులు సైతం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రస్తుతం మొయినాబాద్ మున్సిపాలిటీగా మారడంతో ఇప్పుడైనా చెత్త సమస్య తీరుతుందా అనేది ప్రశ్నార్థకం.

ఐదేళ్లుగా..

మొయినాబాద్‌లో గత ఐదేళ్లుగా చెత్త సమస్య తీవ్రమైంది. మండల కేంద్రం కావడంతో ఇళ్లలో నుంచి వెలువడే చెత్తతో పాటు షాపులు, చికెన్ సెంటర్లు, హోటళ్ల నుంచి సైతం వ్యర్థపదార్థాలు ప్రతి నిత్యం వస్తుంటాయి. ప్రతి రోజు సుమారు నాలుగైదు ట్రాక్టర్ల చెత్త వెలువడుతోంది. అయితే మొయినాబాద్‌కు గతం నుంచి డంపింగ్‌యార్డు లేదు. ప్రత్యేకంగా ప్రభుత్వ స్థలం లేకపోవడంతో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు సేకరించిన స్థలంలో గత ఐదేళ్లుగా చెత్త పారబోస్తున్నారు. సురంగల్ వెళ్లే దారిలో రోడ్డు పక్కనే చెత్త పారబోస్తుండడంతో దుర్వాసనతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. స్థానికులతో పాటు రోడ్డుపై వచ్చేవారు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తతో పాటు వ్యర్థపదార్థాలు వేస్తుండడంతో వాటి కోసం కుక్కలు, ఆవులు అక్కడికి వస్తున్నాయి. రాత్రి సమయంలో రోడ్డుపై వెళ్లే వాహనదారులకు కుక్కలు, ఆవులతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

డంపింగ్‌యార్డు లేక..

మొయినాబాద్‌కు ప్రత్యేకంగా డంపింగ్‌యార్డు లేకపోవడంతో చెత్తను రోడ్డు పక్కన వేస్తున్నారు. మొయినాబాద్‌కు గతం నుంచి రెవెన్యూ లేకపోవడం, ప్రభుత్వ స్థలం లేకపోవడంతో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయలేదు. కొంత కాలం క్రితం డంపింగ్‌యార్డు ఏర్పాటుకు సురంగల్ రెవెన్యూలోని ప్రభుత్వ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. కానీ సురంగల్ గ్రామస్తులు తమ రెవెన్యూలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయొద్దని అభ్యంతరం చెప్పారు. దీంతో డంపింగ్‌యార్డు ఏర్పాటు ముందుకుసాగలేదు.

మున్సిపల్ ఏర్పాటుతో..

ప్రస్తుతం ఎనిమిది గ్రామ పంచాయతీల విలీనంతో మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటైంది. మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్‌యార్డు ఎక్కడైనా ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. దీంతో మొయినాబాద్‌కు సంబంధించిన డంపింగ్ యార్డును మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్, పెద్దమంగళారం, చిలుకూరు గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. దీనిపై మున్సిపల్ అధికారులు ఎలా దృష్టిసారిస్తారో వేచి చూడాలి.

దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం



మొయినాబాద్‌కు సంబంధించిన చెత్త మొత్తం సురంగల్ రోడ్డు పక్కన వేస్తున్నారు. రోడ్డుపై వెళ్తుంటే దుర్వాసన వస్తోంది. వ్యర్థ పదార్థాల కోసం చెత్తవేసే ప్రాంతానికి కుక్కలు, ఆవులు వస్తున్నాయి. అవి రోడ్డుపైకి అకస్మాత్తుగా వస్తుండడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– కమ్మరి శ్రీనివాస్‌చారి, సురంగల్

సమస్యను పరిష్కరిస్తాం



మొయినాబాద్‌లో డంపింగ్‌యార్డు లేకపోవడంతో చెత్త వేయడానికి స్థలంలేక ఇబ్బందిగా మారింది. రోడ్డు పక్కన వేసిన చెత్తను జేసీబీతో తొలగించాం. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి చెత్త సమస్యను పరిష్కరిస్తాం.

–మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్, మున్సిపల్ కమిషనర్

మాదిగలందరూ ఐక్యంగా కలిసిరావాలి



ఖానాపూర్‌లో నూతన సభ్యులకు నియామకపత్రం అందిస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణకు మాదిగలందరూ ఐక్యంగా కలిసిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్‌మాదిగ అన్నారు. మండలంలోని మల్కాపూర్, ఖానాపూర్ గ్రామాల్లో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులతో సమావేశాలు నిర్వహించి గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు-వేల గొంతుల ప్రదర్శనను పెద్దఎత్తున విజయవంతం చేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న వ్యతిరేక శక్తులకు మన సత్తా చూపించాలన్నారు. ఈ సందర్భంగా మల్కాపూర్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.శాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా జి. ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.మహేందర్, కార్యదర్శులుగా జయరాజ్, సుధాకర్, అధికార ప్రతినిధిగా అమృత్‌రాజ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా అశోక్, కోశాధికారిగా నాగేందర్‌ను ఎన్నుకున్నారు. ఖానాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జి. జశ్వంత్, ఉపాధ్యక్షుడిగా మానిక్యం, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కార్యదర్శులుగా శ్రీనివాస్, హరిప్రసాద్, అధికార ప్రతినిధిగా నర్సింహ, సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రకాశ్, కోశాధికారిగా వెంకటేశ్‌ను ఎంపిక చేసి ప్రకటించారు. మాదిగలను ఏకం చేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రమేశ్, అనంతరాములు, తదితరులు ఉన్నారు.

'లక్ష డప్పుల'ను విజయవంతం చేయండి

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం లక్ష డప్పులు-వేయి గొంతుకల మహాప్రదర్శన వాల్‌పోస్టర్, కరప్రతాలను ఆవిష్కరించారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు, తైథా పర్వతాలు, కోడూరు రాములు, శ్రీశైలం, భీమయ్య, లింగం, గ్యార సురేశ్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం రుషికేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు రూ.1లక్ష 54వేల కోట్లను ఎలాంటి వడ్డీ లేకుండా రుణాలను ఇచ్చేందుకు కేటాయించిందని పేర్కొన్నారు. రూ.12.70లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి జీరో టాక్స్ నిర్ణయాన్ని తీసుకోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఏడాదికి లక్ష వరకు ఆదా అవుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు ఆమోద యోగ్యమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినందుకు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

విద్యారంగానికి మొండి చేయి

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో గతం కంటే 2శాతం మాత్రమే పెంచిందని, కేంద్రం పెంచిన నిధులు విద్యారంగ అభివృద్ధికి ఏ మాత్రం సరిపోవని ఆరోపించారు. దేశంలో పాఠశాల విద్యకు నిధుల కొరత తీవ్రంగా ఉందని, విద్యారంగానికి నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

కార్పొరేట్ విద్యకు అనుకూలం

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటీకరణ విద్యకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి తీరని అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మోదీ ప్రభుత్వం మొండిచేయి చూపిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్నా విభజన హామీ చట్టంలో పేర్కొన్న హామీలు కేంద్రం నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్ర విద్యారంగ అభివృద్ధికి సరిపోయే నిధులను బడ్జెట్‌లో కేటాయిస్తే మంచి విద్య అందుతుందని వివరించారు.

బడ్జెట్‌తో అన్ని వర్గాలకు మేలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని కేంద్రం పెంచిందని, దీంతో రైతులు మరింత సులభంగా రుణాలు పొందవచ్చన్నారు. బడ్జెట్‌పై అన్ని విషయాలను చర్చించేందుకు కేంద్ర మంత్రులు, ఎంపీలు అవసరం లేదని, పార్టీ కార్యకర్తలు బడ్జెట్‌లోని అన్ని విషయాలపై క్లుప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు వివరిస్తారన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎన్నికల ముందు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీనిచ్చారన్నారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణ పనులను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాట్లాడే నైతిక హక్కులేదన్నారు.

తెలంగాణపై మొండివైఖరి

పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై మొండి వైఖరి చూపిస్తోందని అనడానికి కేంద్ర బడ్జెట్ నిదర్శనం అని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీశ్, చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీమ్‌భరత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల కాంగ్రెస్ కార్యాలయంలో బడ్జెట్‌పై విలేకరుల సమావేశాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గెలుపొందిన బీజేపీ ప్రజాప్రతినిధులు కనీసం ఆత్మపరిశీలన చేసుకొని, రాష్ట్రానికి ఇచ్చింది, చేసింది ఏమిటో తెలుసుకోవాలన్నారు. బీజేపీ అంటే పెట్టుబడిదారుల పార్టీ అని, గబ్బర్‌సింగ్ లాంటి ట్యాక్స్‌లు వసూలు చేసుకొని తెలంగాణ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంపై పీఎం మోదీ కక్షపూరితంగానే బడ్జెట్ విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ అన్యాయంపై నేటి నుంచి బీఆర్ అంబేడ్కర్‌కు జిల్లాల వారీగా నియోజకవర్గాల్లో విగ్రహాల వద్ద నిరసన తెలుపుతూ వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఇద్దరు మంత్రులు ఉన్నా నరంలేని నాలుక లాంటి వారని దమ్ము, ధైర్యం ఉంటే బడ్జెట్‌పై మాట్లాడి తెలంగాణకు నిధులు తీసుకురావాలని వారు హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాలను చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారే తప్పా ఈ బడ్జెట్‌పై ఎందుకు మాట్లాడలేకపోయారన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంజర్ల భాస్కర్, ఎన్కెపల్లి మాజీ సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, రాజేందర్, భద్రప్ప, వెంకట్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ లక్ష్మీదేవితో సమానం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి



ఆడబిడ్డ తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీరాంరెడ్డి

షాబాద్: ఆడబిడ్డ ఇంటికి లక్ష్మీదేవితో సమానమని, ఆడబిడ్డకు జన్మనించిన ప్రతీ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్నట్లు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిమ్మాన్నోళ్ల శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన కడుమూరు మహేందర్, ప్రశాంతి దంపతులకు ఆడ శిశువు జన్మించడంతో వారికి రూ.5వేల 211 రూపాయలు నగదు అందజేసినట్లు తెలిపారు. తమ గ్రామంలో ఇప్పటివరకు 22 మంది దంపతులకు ఆయన సొంతంగా ఆర్థికసాయం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సత్తయ్య, దేవేందర్‌రెడ్డి, కురుణాకర్‌రెడ్డి, మల్లేశ్, మహేందర్, రాములు, రాజు తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు వివక్ష చూపించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీహార్‌కు అధికంగా నిధులు ఇచ్చి రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వనరుల వినియోగ సామర్థ్యం ఉన్న తెలంగాణ వంటి రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రాష్ట్రాల ఆదాయ వాటా తగ్గించేలా కేంద్రం వ్యవహరించిందన్నారు. సెస్‌లను పెంచడం ద్వారా రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయపు వాటా మరింత తగ్గిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా చేసుకున్న ఒప్పందాలను కూడా కేంద్రం విస్మరించిందన్నారు. శ్రమ తగినంత వేతనం అందడం లేదని ఎంతో కాలంగా ఉపాధి హామీ కూలీలు ఆందోళన చెందుతున్నారని, బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి గతంలో కంటే తక్కువ నిధులు కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలు ఎంతో నమ్మకంతో ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి అధిక స్థానాలు అందిస్తే వారిని కేంద్ర ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆరోపించారు. చిన్న రాష్ట్రాలను ఆర్థికంగా బలహీన పరిచి వారిపై ఆధిపత్యం చలాయించడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు. కేంద్రానికి తెలంగాణ నుంచి అధిక మొత్తంలో పన్నులు వెళ్తున్నాయని, అయినా రాష్ట్రాభివృద్ధికి సరైన నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు.

ప్రచారంలో వాస్తవం లేదు

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కొందరు ప్రభుత్వంపై తిరుగుబాటు కోసం రహస్య సమావేశాలు నిర్వహించారని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో ఎంఎస్ఎన్ పరిశ్రమ అధినేత జీవన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్, తిరుపతిరెడ్డి, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్ష ఎంపికపై ఫిర్యాదు



రాష్ట్ర ఇన్‌చార్జికి అధ్యక్ష ఎంపికపై వివరిస్తున్న మహేశ్

కేశంపేట: ప్రజాభిప్రాయ సేకరణలో ఓట్లు సాధించని వారికి అడ్డదారిన మండల అధ్యక్ష పదవిని కట్టబెట్టారని ఆరోపిస్తూ బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కుమ్మరి మహేశ్ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సంఘటన మంత్రి(ఇన్‌చార్జి) చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ అధ్యక్షులు, క్రియాశీల సభ్యులు 59 మందిలో 45 మంది మద్దతు తనకు లభించినా.. ఎంపికలో కుట్రపూరితంగా వేరే వారికి అధ్యక్ష పదవిని అప్పగించారని ఆయన తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో కొందరు కుట్రలు చేసి అధ్యక్ష పదవికి అర్హత ఉన్న తనను కాదని మరొకరికి ఇప్పించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి వివరాలను తెలుసుకున్న రాష్ట్ర ఇన్‌చార్జి సమగ్ర వివరాలను తెలుసుకొని న్యాయం చేస్తానని హామీనిచ్చినట్లు ఆయన తెలిపారు.

మాడ్గుల సీఐగా వేణుగోపాలరావు

మాడ్గుల: మాడ్గుల సీఐగా వేణుగోపాలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన జగదీష్ ఇబ్రహీంపట్నానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వేణుగోపాలరావు స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్ఐలు, సిబ్బంది మర్యాద పూర్వకంగా సత్కరించారు.

మహిళకు పదవి వస్తే జీర్ణించుకోలేరా?



సమావేశంలో పాల్గొన్న నాయకులు

- ఎంపికపై తప్పుడు ప్రకటనలు సరికాదు
- బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్

కేశంపేట: మహిళకు మండల అధ్యక్ష పదవి వస్తే జీర్ణించుకోలేక.. కొందరు ఎంపికపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్ అన్నారు. కేశంపేట గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నూతనంగా మండల అధ్యక్షురాలిగా ఎంపికైన రొల్లు రాధికకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రఘురాంగౌడ్ మాట్లాడుతూ.. మండల అధ్యక్షురాలి ఎంపికను నిరసిస్తూ పలువురు ఇటీవల పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. బూత్ కమిటీల్లో తనకు అత్యధిక ఓట్లు వచ్చాయని చెప్పుకోడవం, అసలు గ్రామాల్లో సీనియర్ నాయకులకు తెలియకుండా బూత్ కమిటీలను వేశారని ఆయన అన్నారు. అధ్యక్షురాలి ఎంపికపై ఆరోపణలు చేస్తున్న నాయకులు, వారే గ్రామాల్లో బోగస్ బూత్ కమిటీలను వేశారని ఆయన అన్నారు. గతంలో వేరే పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి ఎలాంటి సభ్యత్వం లేకపోయినా పార్టీ మండల అధ్యక్ష పదవిని ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. అందరం కలిసి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో నూతన పార్టీ మండల అధ్యక్షురాలు రొల్లు రాధిక, మధుసూదన్‌గౌడ్, మోటే శ్రీనివాస్, ఉదయ్‌గౌడ్, యుగేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.